నీకూ, నాకూ; వాడికీ, వీడికీ; పక్కింటాడికీ, ఎదురింటాడికీ; వెనకింటాడికీ; అందరికీ ఉన్నారు పెళ్ళాలు. మరి 'సీతాలు' ప్రత్యేకత ఏమిటి? నిప్పు ఎందుకు రాజుకుంది?



మంటలు! ఎటుచూసినా మంటలు!! ఆ వాడంతా మంటల మధ్య మండిపోతోంది. తాటాకులు గాలిలోకి చిటపట ధ్వనులు చేసుకుంటూ ఎగురుతున్నాయి... అక్కడి జనం 'పిచ్చెక్కిన వాళ్ళ'లాగా అటూ యిటూ తిరుగు తున్నారు. ఎదుట వాళ్ళని పట్టించుకోకుండా ఎవరి యింటిలోని సామానులు వారు బయటికి లాగుతున్నారు. 'ప్రపంచంలోని స్వార్థం

అంతా వికృతరూపం దాల్చి ఇక్కడి కొచ్చిందా' అన్నట్టు ప్రవర్తిస్తు న్నారు.

"బాబోయ్! నా ఇల్లు ధంసమయింది రోయ్!"

"నాయనోయ్! నా ఇల్లు గుల్లయి



పోనాది రోయ్!"

"ఏ మాయదారింట్లో నెగిసిందోగాని, నా ఇంటి మీదకొచ్చిపడిందిరోయ్!"

ఇలాంటి కేకలు ఆ మంటలకు పోటీగా మిన్నంటుతున్నాయ్.

అక్కడ అగ్నిదేవుడు విలయ తాండవంచేస్తున్నాడు. అయినా కొందరు మానవ ప్రయత్నంగా కుండలతో నీళ్ళు తెచ్చి ఆ మంటల నార్పడానికి విఫలప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ఇంతలో గణగణమని శబ్దం చేసుకుంటూ ఫైరింజన్ వచ్చింది. గబగబా వాళ్ళు దిగి గొట్టాలతో నీటిని ఆ కాలుతున్న గుడిసెల మీదకి కొట్టడం ప్రారంభించారు. మరి కొంత సేపటికి మంటలు తగ్గాయి!

అక్కడ వికృత నాట్యంచేసి అలసిపోయిన అగ్నిదేవుడు తన ఉధృతిని తగ్గించాడు. మళ్ళీ కొత్తగా ఇళ్ళేవీ అంటుకోలేదు. మంటలు తగ్గినా అక్కడ వాతావరణం మాత్రం భీభత్సంగా ఉంది. ఏడుపులూ, పెడబొబ్బలూ తగ్గలేదు.

ఇంతలో అసలు ఇళ్లు కాలడానికిగల కారణమేమిటో బయట పడింది. సింహాచలం ఆ పేటలోని ఓ కూలీ. మామూలుగా తాగి వచ్చి మైకంలో పెళ్లాంతో తగువాడి ఆ కోపంలో పొయ్యిలో కాలుతున్న కట్టెలాగి తన గుడిసెకి నిప్పంటించాడన్న నిజం దావానలంలా వ్యాపించింది! అసలే ఏడ్చి ఏడ్చి అలసిపోయిన వాళ్ళకు అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది!

వాళ్ళలో కోపాగ్ని ఒక్కసారి భగ్గుమంది!

అందరూ కట్ట కట్టుకుని, కాలిపోగా మిగిలిన సింహాచలం యింటిమీద పడ్డారు.

ఆ సింహాచలంకింకా తాగిన మత్తు వదల్లేదు.

అక్కడ శవంలాపడి ఉండి ఏవేవో అర్థంలేని మాటలు సణుగుతున్నాడు. వాళ్ళందరి కళ్ళూ అగ్నికణాల్లా ఉన్నాయి!

ఓ తాగుబోతు వెధవ చేసిన వెధవపని వల్ల వాళ్ళందరూ నష్టపోయారన్న కోపం వాళ్ళని నిలువెల్లా దహించి వేస్తోంది. అందుకే ఆ హోరు, ఆ జోరు! ఆ ప్రవాహాన్ని ఆపేశక్తి ఎవరికీ లేదు. ఇక సింహాచలానికి భూమ్మీద నూకలు చెల్లినట్లే!

"ఒరేయ్! సింహాచలం! నిన్నీ మంటల్లో తగలేస్తాం. రారా తాగుబోతు ఎదవా!" అందులో కొందరు బిగ్గరగా అరుస్తున్నారు.

ఇంతలో ఆ గుంపుని తోసుకొని సీతాలు ముందుకొచ్చింది. ఆమెవరో కాదు. సింహాచలం పెళ్ళాం!

"ఎంరా! ఎంతపని సేసినావురా? యిన్నా! ఈల్లగోడు యిన్నా! ఈళ్ళు సురు మనకి తగులుద్దిరా! చచ్చినోడా! తాగొద్దని ఎన్నిసార్లు సెప్పాన్నా! ఇప్పుడు సావురా! కుక్కసావు సావురా!" అని శవంలా పడివున్న సింహాచలాన్ని కసితీరా తన్నడం ప్రారంభించింది!

అందరూ అవాక్కయి నిల్చుండిపోయారు. సాక్షాత్తూ వాడిపెళ్ళాం వాణ్ణి కాలితో తంతుంటె ఏం చేయాలో తోచక స్థాణువుల్లా అయిపోయారు. అయినా వాళ్ళకోపం మళ్ళీ బుస్సుమని లేచింది! వాడు చేసినపని ఎంత నీచమయిందో మళ్ళీ గుర్తొచ్చింది! అంతే!

"ఈణ్ణిలాకాదు. డొక్కలో ఓ

పోటు పొడాలి" అని యాడ్చి తన్నాడు రిక్షా సూరిగాడు!

ఇంక అందరూ మీదపడి తలో చెయ్యి వెయ్యిబోయేరు!

"ఆగండి!" గట్టిగాఅరిచింది సీతాలు. "ఈణ్ణిలాకాదు. పోలీసోళ్ళకి అప్పజెప్పాలి! అప్పుడీడి తిక్కకుదరాలి" అని గట్టిగా అందిసీతాలు. అందరూ "ఔనాను" అన్నారు.

ఇంతలో సూరిగాడు రిక్షా తెచ్చాడు. కొందరు సిఁవాచలాన్ని ఎత్తి రిక్షాలో వేశారు కొద్దిగా తెలివి వచ్చి రానట్లుంది సివాఁచలంకి.

"ఏవేఁ....నం... నన్ను తంతా.. వు...టే" అని ఏదో గొణుక్కుంటూసీతాల్ని తిట్టడం ప్రారంభించాడు రిక్షాలోంచి.

అందరూ 'వన్ టౌన్' పోలీస్ స్టేషన్ వేపు తిరిగారు.

సీతాలు రిక్షా దిగింది.

"మీరందరూ అక్కడి కెందుకు? అసలే మీ ఆడోళ్ళు పేనాలుపోయిన సవాల్లాగా పడి వున్నారు. ఆళ్ళకి తోడుగా ఇక్కడే వుండండి. ఈడ్ని నేనూ, సూరిగాడు పోలీసులకి అప్పగించి వొచ్చేస్తాం" అంది.

**అతని మైకం గూడాన్ని బూడిద చేసింది. ఆమె ధైర్యం అతగాణ్ణి కాపాడింది. అతని అనుమానం ఆమె గుండెల్లో బాకైంది. నిజం నిప్పులా అతన్ని దహించింది.**

అందరూ అక్కడే ఉండిపోయారు.

"అప్పగిస్తే సరిపోదే! రిపోర్టియ్యాలి! జరిగింది సెప్పాలి" రిక్షా తొక్కుకుంటూ అన్నాడు సూరిగాడు.

"నాకు తెలుసులేరా! నువ్వు ముందు తొక్కు!" కసిరింది సీతాలు వాడ్ని.

ఓ పదినిముషాలు తరువాత పోలీసు స్టేషన్ వచ్చింది. రాత్రి ఒంటిగంట అయ్యిందేమో- స్టేషన్ లోని కానిస్టేబిల్ కునికిపాట్లు పడుతున్నాడు. కుర్చీలో ఇన్స్పెక్టర్ లేడు సూరిగాడూ,సీతాలూ సివాఁచలాన్ని లోపలికి ఈడ్చుకెళ్ళారు. సివాఁచలంకి మత్తుగా నిద్ర పట్టేసింది రిక్షాలో.

"ఏటయ్యిందే? రాత్రేల ఏటీ నూసెన్సు? ఎవడీడు?" విసుక్కుంటూ లేచాడు డ్యూటీ కానిస్టేబిల్!

"అంతా సెప్తాం. ముందీడ్ని కొట్లో యెయ్యండి బాబూ!" అంది సీతాలు.

"అసలు కేసేటో చెప్పండి!" ఆవులిస్తూ అన్నాడు కానిస్టేబిల్.

"అదంతా తర్వాత సెప్తాం. ముందీ సచ్చినోణ్ణి కొట్లో ఎట్టండి బాబూ" అన్నాడు సూరిగాడు.

"ఇక్కడ నేనుతప్ప మరోడులేదు.

అందరూ యిప్పుడే కేంపెళ్ళారు. ఇంతకీ ఈడుచేసిన ఎదవ పనేటి?'' అంటూనే కానిస్టేబిల్ సూరిగాడి సాయంతో అక్కడున్న లాకప్ రూమ్‌లో పివాఁచలాన్ని పడేశాడు.

''ఒరేయ్ సూరీ! నువ్వీలోపల బాబు గారికో మంచి 'టీ' తీసుకురారా! నువ్వగూడా ఓ టీ తాగు'' అంటూ ఓ రూపాయినోటు తీసిసూరిగాడి కిచ్చింది.

ఆ నోటు చూడడంతోనే కానిస్టేబిల్ మత్తు పూర్తిగా వదిలేసింది! సూరిగాడు బయటకెళ్ళాడు.

''బాబూ! అసలు యిసయం ఏటంటే ఈడు నా యజమాని. సాయంత్రం తప్ప తాగేసి యింటికొచ్చి నన్ను గొడ్డును బాదినట్టు బాదాడు! ఈడికి తెలివొస్తే నన్ను సంపేత్తాడు. అందుకని యిలా తెచ్చేసినాం బాబూ!'' అంది దీనంగా సీతాలు.

''భలే! భలేగుంది నీ కత! తప్ప తాగిన మొగుడు తన్నాడని పోలీసు స్టేషన్‌కి తెచ్చావా మొగుడ్ని! నీ లాగా తప్పతాగిన మొగుళ్ళందరూ యిక్కడకొస్తే మేం బతికినట్టే! ఇంకానయం, ఈరోజు నేను తాగ లేదుకాబట్టి సరిపోయింది. లేకపోతే నువ్వు యిక్కడనుండి సరిగ్గా ఎల్లే దానివేటి? ఉండు. ఈ నా కొడుకుని ఇప్పుడే బయటకీడ్చేస్తాను''అంటూ లాకప్ రూం వైపు వెళ్ళబోయాడు.

''బాబ్బాబు! మీకు పున్నె వుంటాది అలా సేయికండి! కావాలంటే అయిదో, పదో యిచ్చుకుంటాను'' అంటూ ఓరెండు కానిస్టేబిల్ చేతిలో పెట్టింది.

తక్కనాగిపోయాడు కానిస్టేబిల్!

''సర్లే. నువ్వింత యిదిగా అడుగు తున్నావు కాబట్టి యీడ్ని యిక్కడే ఉంచుతాను. మహా అయితే మూడ్రోజులు జైల్లో వేస్తారు. మరి ఆ తర్వాత సంగతేటి?నువ్వేం పెళ్లానివి? అందరూ మొగుళ్ళనిడిపించం డని యిక్కడికొస్తారు. నువ్వేమో మొగుడ్ని ముయ్యండనంటున్నావ్. సర్లే, తరువాతొచ్చి మిగిలిన ఆ ఎని మిదీ ఇచ్చుకో'' అన్నాడు

ఇంతలో సూరిగాడు టీ తెచ్చాడు. కానిస్టేబుల్ టీ అందుకుంటూ, ''ఈ దెవడు!'' అన్నాడు.

''ఆడు సేసినఎదవపనికి సాచ్చీకం'' అంది సీతాలు.

''ఔను బాబూ! ఆడుత్తఎదవండీ!''

''ఆఁ- యింక దయచేయండి. నాకు నిద్దరొస్తోంది'' అని కాళీ టీగ్లాసు యిచ్చాడు కానిస్టేబుల్.

ఇద్దరూ బయటకొచ్చారు.

మరో మూడు రోజులు గడిచాయి! ప్రభుత్వం అగ్ని ప్రమాదానికి గురైన వాళ్ళకి యింటికి రెండు వందల చొప్పున యిచ్చింది. తాత్కా లికంగా 'షెడ్సు' కట్టారు. భోజ

నాలుకూడా ఏర్పాటు చేశారు. ఈ లోగా సివాఁచలంకి న్యూసెన్స్ కేసు కింద మూడు రోజులు శిక్ష వేశారు. కాని వాడే యింటికి నిప్పంటించా డన్న నిజం మాత్రం బయట లేదు. వాడు జైల్లోంచి బయట కొచ్చాడు, వాడు చేసిన పని యిప్పుడు జ్ఞాపకం వచ్చింది. అందుకే అర్ధరాత్రివరకూ ఊరవతల గడిపాడు. వస్తూ వస్తూ కాసయ్య కొట్లోఅరువు ఓగ్లాసు సారాతాగాడు. అక్కడే పెణకమీద ఉన్న ఓ కత్తి ఎవరూ చూడ కుండాతీశాడు. వాడి గుండెల్లో పగ, ద్వేషం, అవమానం రగులు కుంటున్నాయి. తనస్వంత పెళ్ళాం, కాలితో తన్ని పోలీసోళ్లకి అప్పగిస్తుందా? అన్నది వాణ్ణి నిలువునా దహించేస్తోంది అందుకే సీతాలు గురించి ఎక్కువగా ఆలోచించదల్చుకోలేదు. 'ఆ లం...ని-సంపెయ్యాలి' అనుకున్నాడు మనసులో.

> తాగుబోతు, తిరుగుబోతు మొగుళ్ళని, అనుమానపు అంట్ల వెధవల్ని భరిస్తూ వస్తున్న భారత స్త్రీలు నిజం గ్రహించి కళ్ళు తెరవలేరా?

వాడు ఆ అర్ధరాత్రి భయంకరంగా నడుస్తూ తన వీధిలోకి వెళ్ళాడు. సగంకాలిపోయి మిగిలిన ఆ మొండి గోడలు చాలా భయంకరంగా కనిపిస్తున్నాయి. కాలిపోయిన తన ఇంటి ముందు నులక మంచంమీద పడుకుంది సీతాలు! పైటజారి ఉంది. బొడ్లోంచి కత్తి తీసాడు.

"చావు నంజా!" అంటూ ఒక్కపోటు పొడిచాడు!

"అమ్మా"అంటూ దిక్కులు పిక్కటిల్లేలా అరిచింది సీతాలు-బాధతో. అందరూ తుళ్ళిపడి లేచారు. సివాఁచలంపారిపోతూ కన్పించాడు. "పట్టుకోండి! పట్టుకోండి!!" అంటూ కొందరు వాడి వెనకాతల పరిగెట్టి వాడ్ని పట్టుకున్నారు. రక్తం ధారగా కారుతోంది సీతాలు గుండెల్లోంచి.

"ఎదవా ఎంత పని సేసినావురా? కట్టుకున్న దాన్ని కసాయోడ్లా సంపుకుంటావట్రా? ఆ రోజు కోపంలో నిన్ను మేమందరం సంపేత్తామని నిన్ను జెయిల్లో యెట్టించి నీపేణాలు కాపాడిన యీ సీతాల్ని సంపుతావట్రా?" ఆవేశంగా అరుస్తూ సూరిగాడు సివాఁచలం డొక్కలో తన్నాడు. సీతాలుఏదో మాటాడాలని ప్రయత్నించి మాట్లాడలేక.... అలా సివాఁచలంవేపు చూస్తూనే ప్రాణాలు విడిచింది. "సీతాలూ!" అంటూ భయంకరంగాఅరిచాడు సివాఁచలం! ఆ మర్నాడు సీతాలు శవం మంటల్లో కాలి బూడిదయ్యింది!

జైల్లో సివాఁచలం గుండెలు 'మంటల్లో' మండుతూనే ఉన్నాయి!!